https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 69 మంగళవారం 14-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# కలిసి సాధిద్దాం!

## రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేద్దాం

**మెట్రో రైలు పనులు ముందుకు సాగేలా చూడండి**

**ఆర్ఆర్ఆర్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం రావాల్సి ఉంది**

**మూసీ టెండర్లు అర్బన్ చాలెంజ్ ఫండ్ కిందకు వచ్చేలా చూడాలి**

**తుంగభద్రలో పూడిక తొలగింపుకు కేంద్ర మంత్రి ఓకే.. మీరూ కలవండి**

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలుద్దాం**

**గోదావరి-కావేరీ అనుసంధానంతో మనకు నీళ్లు, నిధులు వస్తాయి**

**ఎంపీలకు సీఎం రేవంత్ నిర్దేశం**

**పార్టీలకతీతంగా ఎంపీలు ఏ సమాచారం అడిగినా ఇవ్వాలని అధికారులకు ఆదేశం**




**హైదరాబాద్, జూన్ 13 :** తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు ప్రజా భవన్‌లో సోమవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. “హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరం. ఇందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలి. ఆర్ఆర్ ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ్సేకరణ పూర్తయింది. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. మూసీ పునరుజ్జీవ పనుల్లో మొదటి దశ టెండర్లకు వచ్చింది. వీటిని అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్రం అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉంది. ఇందుకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలి” అని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం రేవంత్ ఎంపీలకు వివరించారు. ఇందుకు ఎస్‌బీఐ క్యాప్స్‌ని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపీలకు సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. అంతరాష్ట్ర నదీ జలాల విషయమై ఇటీవల కర్ణాటకలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులతో చర్చించిన అంశాలను ఎంపీలకు సీఎం రేవంత్ వివరించారు. “తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీలు రావాలి. పూడిక కారణంగా 5 టీఎంసీలకు మించి రావడం లేదు. డ్యామ్‌తోపాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని పాటిల్‌ను కోరాం. ఈ అంశంపై ఎంపీలు కేంద్రమంత్రిని కలవాలి” అని సూచించారు.

మిగతా 2లో...

### ఉన్మాది రాజ్‌కుమార్

# ఆత్మహత్య..

**6 హత్యల కేసు నిందితుడు గడ్డిమందు తాగి బలవన్మరణం**

**పెంజర్ల గ్రామంలోని పొలంలో మృతదేహం లభ్యం**

**గుర్తించి డయల్ 100కు సమాచారమిచ్చిన స్థానికులు**

**హత్యాకాండకు ముందు నిందితుడి సెల్ఫీ వీడియో**

**సూసైడ్ నోట్‌నూ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**అమ్మాయి కుటుంబం వల్ల అప్పులపాలయ్యానని, విరక్తితోనే హత్యలు చేస్తున్నానని పేర్కొన్న నిందితుడు**

**చివరి సమయంలో సానుభూతి కోసం ప్రయత్నం!**

**మారణకాండకు రెండు కత్తులు వాడిన రాజ్‌కుమార్**



**హైదరాబాద్, జూన్ 13 :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ కథ ముగిసింది. మైనర్ బాలిక, భార్యాపిల్లలతో సహా ఆరుగురిని దారుణంగా చంపి తప్పించుకు తిరుగుతున్న ఉన్మాది ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తన మేనమామ గ్రామమైన పెంజర్లలో ఓ పొలంలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహం పక్కన గడ్డిమందు డబ్బా పడి ఉంది. ఓ వెంచర్‌కు ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమిలో ఓ మృతదేహం పడి ఉందంటూ స్థానికులు సాయంత్రం 4గంటల సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ముఖ కవళికల ఆధారంగా మృతుణ్ని రాజ్‌కుమార్‌గా గుర్తించారు. అతని సోదరుడిని అక్కడికి రప్పించి నిర్ధారించారు. నోటివెంట రక్తం, నురగ ఉండడంతోపాటు శరీరం పూర్తిగా బిగుసుకుపోవడంతో.. అతడు గడ్డిమందు తాగి అప్పటికే ఏడెనిమిది గంటలు గడిచి ఉంటుందని పోలీసులు తెలిపారు.

మిగతా 2లో...

## మాకు క్షమాపణ చెప్పాలి..

**మెల్‌బోర్న్ మీట్స్ మోదీ కార్యక్రమ నిర్వాహకులు**



**మెల్‌బోర్న్** మెల్‌బోర్న్ మీట్స్ మోదీ కార్యక్రమంపై కొందరు కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలను కార్యక్రమ నిర్వాహకులు ఖండించారు. ఈ విషయమై తమకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు కూడా లేఖ రాశారు. ఇటీవల ఆస్ట్రేలియాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా మెల్‌బోర్న్ మీట్స్ మోదీ కార్యక్రమం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ కార్యక్రమానికి జనాల్ని డబ్బులు ఇచ్చి పిలిచారని సీనియర్ నేత పవన్ ఖేరాతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలను కార్యక్రమ నిర్వాహకులు తమ లేఖలో ఖండించారు. కాంగ్రెస్ నేతల ఆరోపణలు అసత్యాలని, అమర్యాదకరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రధాని మోదీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వారందరూ తమంతట తాముగా సొంత ఖర్చులతో అక్కడికి వచ్చారని అన్నారు. బీజేపీగానీ, భారత ప్రభుత్వం గానీ ఆస్ట్రేలియా ప్రభుత్వం గానీ ఈ ఖర్చులకు డబ్బులు చెల్లించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ బేరర్లు, ఇతరుల వ్యాఖ్యలు ఆస్ట్రేలియాలో ఎన్నారైల వ్యక్తిత్వంపై వేలెత్తి చూపేలా ఉన్నాయని అన్నారు.

# మార్చి 31నాటికి పోలవరం సిద్ధం!

## అప్పటికల్లా తొలిదశ పూర్తిచేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం

- **18న రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల**
- **మొదటి దశ పనులన్నిటికీ నిధులు కోరతాం**
- **రెండో దశ పనులకూ చాలా డబ్బు కావాలి**
- **ప్రాజెక్టును 37 సార్లు సందర్శించా.. 136 సార్లు వర్చువల్ రివ్యూ చేశా**
- **ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు అఖండ హారతి**
- **శ్రీశైలంలో నిల్వలుంటే సెప్టెంబరు 1న వెలిగొండ నుంచి నీటి విడుదల**
- **మూడేళ్లలో 36 ప్రాధాన్య ప్రాజెక్టులు పూర్తి**
- **ఏపీ సీఎం చంద్రబాబు**



**అమరావతి, జూలై 13 :** రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు తొలిదశ పనులన్నీ వచ్చే మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆపై గోదావరి నదికి వరద వచ్చిన వెంటనే ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వస్తున్నారని.. పోలవరం తొలిదశలో కేంద్రం నుంచి రావలసిన నిధులు మంజూరు చేయాలని కోరతామని చెప్పారు. సోమవారం ఆయన పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అంతకుముందు మధ్యాహ్నం 12.15 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండల పరిధిలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్దకు వెళ్లారు. రూ.153 కోట్ల వ్యయంతో చేపట్టిన 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. అక్క డ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఆ తర్వాత పిచ్చుకలంకలో రైతులతో ఏర్పాటుచేసిన భారీ సభలో ప్రసంగించారు. తర్వాత పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వర ద ప్రవాహాన్ని హెలికాప్టర్లో తిలకించారు. అనంతరం క్షేత్ర స్థాయికి వెళ్లి ఎర్త్ కమ్ రాక్ ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం గ్యాప్-2, గ్యాప్-1, జలవిద్యుత్కేంద్రం, ట్విన్ టన్నెళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల తో, జిల్లా కలెక్టర్లతోనూ ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ఇప్పటికి 37 సార్లు పోలవరం ప్రాజెక్టు ను సందర్శించానని.. 136 సార్లు వర్చువల్‌గా సమీక్షించానని గుర్తుచేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**ఆ వెంటనే రెండో దశ పనులు..**

2019లో టీడీపీ గెలిచి ఉంటే 2021 నాటికి పోలవ రం పూర్తయ్యేది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పనుల ను మరింత వేగవంతం చేసి ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించాం. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి పోలవరం తొలిదశ పనులు పూర్తయిన వెంట నే.. రెండో దశ పనులు ప్రారంభిస్తాం. అధిక నిధులు వ్యయం చేయాల్సి ఉన్నందున.. రానున్న మూడేళ్లలో రెండో దశ పనులు పూర్తి చేయడం కష్టమే. శ్రీశైలం జలాశయంలోకి కృష్ణా జలాలు వచ్చి నీటి నిల్వలు చేరితే.. సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తాం. ప్రాజెక్టు టన్నెల్ పనులు పూర్తికాకుండా.. ఎన్నికలకు ముందు హడావుడిగా వెలిగొండను జాతికి అంకితం ఇస్తున్నట్లు ప్రకటించి నాటి సీఎం జగన్ ప్రజలను మోసం చేశారు.

మిగతా 2లో...

## వరి సాగును నియంత్రించండి

**ఆరు తడి పంటలను ప్రోత్సహించండి.. వర్షాల్లేవు, డెడ్ స్టోరేజీకి రిజర్వాయర్లు**

**ఆగస్టులోనూ వానలు అనుమానమే**

**3దశల్లో ప్రత్యామ్నాయ ప్రణాళిక**

**రైతులు వరికి బదులుగా చిరుధాన్యాల సాగు చేసేలా అవగాహన కల్పించాలి**

**ఎల్‌నినోపై సమీక్షలో మంత్రి తుమ్మల**

2



# మా రక్తం తీసుకో.. రైతులను ఆదుకో

**ఎల్లంపల్లి వట్టిపోతే హైదరాబాద్‌కు తాగునీరెట్లా?**

**బేషజాలు వదిలి నీటిని ఎత్తిపోయండి**

**సీఎంను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యలు**

**రక్తం ఇచ్చి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నిరసన**

**రక్తం ప్యాకెట్లతో రేవంత్ ఇంటికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్ట్**



**కరీంనగర్ జూలై 13** ‘సీఎం రేవంత్‌రెడ్డీ.. కావాలంటే మా రక్తం తీసుకో.. కానీ, రైతులకు సాగు నీరిచ్చి ఆదుకో’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని జలాశయాల్లో నీటి మట్టాలు 20 శాతానికి పడిపోయాయన్నారు. మేడిగడ్డ వద్ద నీటి మట్టం 92.5 మీటర్లు ఉన్నప్పుడు నిరభ్యంతరంగా నీళ్లు ఎత్తిపోయవచ్చని వెల్లడిం చారు. అక్కడి నుంచి అన్నారం, సుందిళ్ల, మిడ్‌మానేరుకు రోజూ 2-3టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. 50 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జలాశయాలను నింపవచ్చని తెలిపారు. మేడిగడ్డతో తమకు సంబంధం లేదని, అక్కడి నుంచి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి పంపులను ప్రారంభించాలని మాత్రమే కోరుతున్నామన్నారు. కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యామ్(ఎల్ఎండీ)ను సోమవారం ఆయన సంద ర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయకపోతే సాగునీటికే కాదు భవిష్యత్తులో హైదరాబాద్‌కు తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందన్నారు. “మేడిగడ్డ దెబ్బతిన్న తర్వాత రెండు రోజుల్లోనే క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే ఎన్‌డీఎస్ఏ రిపోర్టు ఇచ్చింది. అది ఎన్‌డీఏ?సఏ కాదు.. ఎన్డీఏ రిపోర్టు” అని విమర్శించారు.

## దోపిడీ యంత్రాంగంగా విద్యా వ్యవస్థ

**విప్లవాత్మక మార్పులకు ఇదే సమయం: రాహుల్**

2



# వరి సాగును నియంత్రించండి..

**ఆరు తడి పంటలను ప్రోత్సహించండి.. వర్షాల్లేవు, డెడ్ స్టోరేజీకి రిజర్వాయర్లు**

**ఆగస్టులోనూ వానలు అనుమానమే**

**3దశల్లో ప్రత్యామ్నాయ ప్రణాళిక**

**రైతులు వరికి బదులుగా చిరుధాన్యాల సాగు చేసేలా అవగాహన కల్పించాలి**

**ఎల్‌నినోపై సమీక్షలో మంత్రి తుమ్మల**




**హైదరాబాద్, జూలై 13:** రాష్ట్రంలో కరువు పరిస్థితులతో పాటు రిజర్వాయర్లన్నీ డెడ్‌స్టోరేజీకి చేరుకున్నందున వరిసాగును నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నీళ్లు ఎక్కువగా అవసరం రాని ఆరుతడి పంటలను సాగుచే యాలని రైతులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో వ్యవసాయ, విద్యుత్తు, ఉద్యానవన, వాతావరణ, పశుసంవర్ధక, భూగర్భజల, నీటిపారుదల శాఖల అధికారుల తో సోమవారం తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై చర్చించారు. ఎల్‌నినోను ఎదుర్కోవటానికి జిల్లాల వారీగా ప్రణాళికలను రూపొందించి అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమాచారం తప్పకుండా రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా జూలై 15, జూలై 30, ఆగస్టు 15.. ఈ తేదీలను ప్రామాణికంగా తీసుకొని ప్రతీ 15రోజులకొకసారి వర్షపాతాన్ని విశ్లేషించి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను మూడు దశల్లో అమలు చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన విత్తనాలను అన్ని మండలాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. పప్పులు, చిరుధాన్యాలు, వేరుశనగ, కందులు, సజ్జలు, జొన్న, మొక్కజొన్న వంటివి సాగు చేసే విధంగా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ కింది భూముల్లోనూ ఆరుతడి పంటలే వేయాలని, ఆగస్టులో కూడా తక్కువ వర్షపాతమే ఉంటుందని చెప్పారు. బావులు, బోర్ల కింద చిరుధాన్యాలు వేయాలని సూచించారు. ఇప్పటి వరకు 13 జిల్లాల్లో సాధారణ, 20 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలకు, ఎరువులకు కొరత లేదన్నారు. ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో మార్గనిర్దేశం చేయాలన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుకు అండగా ఉంటుందని తుమ్మల భరోసా ఇచ్చారు.

# ఉన్మాది రాజ్‌కుమార్.. (మొదటిపేజీ తరువాయి)




మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్లకు తరలించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన రాజ్‌కుమార్.. ఓ మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడి.. ఆమె కుటుంబ సభ్యులు పోక్సో కేసు పెట్టడంతో ఆమెను, ఆమె తల్లి, నానమ్మ సహా తన భార్యను, ఇద్దరు పిల్లలను గొంతు కోసి కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుణ్ని పట్టుకునేందుకు పోలీసులు మూడు రోజులుగా విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల రివార్డును కూడా ప్రకటించారు. దీంతో అనేక చోట్ల నిందితుడి పోలికలు ఉన్న వ్యక్తులను చూసినట్లు పోలీసులకు ఫోన్లు వచ్చాయి. వీటిని కూడా పోలీసులు పరిశీలించి ఫోన్లు వచ్చిన ప్రాంతాలకు వెళ్లి విచారించారు. అయితే అవన్నీ నిజం కాదని నిర్ధారణ అయినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. సోమవారం కోదాడ ప్రాంతంలో రాజ్‌కుమార్ పోలికలున్న వ్యక్తిని గుర్తించామని, అతని కోసం ప్రత్యేక పోలీసు బలగాలను అక్కడికి తరలించి గాలింపు చేపట్టామని పేర్కొన్నారు. అయితే ఇంతలోనే ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడంటూ డయల్ 100కు సమాచారం అందిందని, వెంటనే పోలీసులను ఘటనా స్థలికి పంపించామని వివరించారు. సుమారు లీటర్ గడ్డిమందు (హెచ్‌పీవో5) తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని వెల్లడించారు.

### హత్యలకు 2 కత్తులు.. చివరిగా బాలిక హత్య

ఆరుగురిని దారుణంగా హత్య చేసిన రాజ్‌కుమార్.. ఇందుకోసం రెండు కత్తులు ఉపయోగించినట్లు సీపీ తరుణ్ జోషి తెలిపారు. శుక్రవారం రాత్రి 10:30 గంటలకు మైనర్ బాలిక ఇంటికి వచ్చిన రాజ్‌కుమార్.. ఆమె తల్లిని, నానమ్మను కత్తితో గొంతు కోసి హతమార్చాడు. అక్కడి నుంచి మైనర్ బాలికను తన వాహనంలో ఎక్కించుకుని తన స్వగ్రామమైన దైవాలగూడకు తీసుకెళ్లాడు. ఆమెను కారులోనే ఉంచి లాక్ వేసి తన ఇంటి తలుపు తట్టి నిద్రిస్తున్న భార్యను లేపాడు. వెంటనే తన కుమారులను కత్తితో పొడిచి చంపడానికి ప్రయత్నిస్తుండగా భార్య సరిత అడ్డుకోవడంతో ఆమె కడుపులో పొడిచి చంపాడు. అనంతరం ఇద్దరు పిల్లల తలను నరికి హత్య చేశాడు. అనంతరం కారులో మైనర్ బాలికను సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి చంపివేశాడు. రాజ్‌కుమార్ అద్దె కారు తీసుకుని ఈ ఘటనలకు పాల్పడ్డాడు. హత్యల తరువాత కారు యజమానికి యూపీఐ ద్వారా అద్దె చెల్లించాడు. అనంతరం నిందితుడు షాబాద్, షాద్‌నగర్ పరిసర ప్రాంతాల్లోనే తిరిగినట్లు తెలుస్తోంది. అతని మృతదేహం వద్ద గడ్డిమందు డబ్బాతోపాటు జేబులో రూ.1250 నగదు, బస్సు టికెట్లు లభ్యమయ్యాయి.

### 2 కోట్ల అప్పులు.. గేమ్స్ కోసం 26 సిమ్‌లు

రాజ్‌కుమార్ వ్యసనాలకు అలవాటు పడ్డట్లు తెలిసింది. అమ్మాయిల పిచ్చితోపాటు బెట్టింగ్‌లు, జల్సాలకు భారీ డబ్బు ఖర్చుపెట్టేవాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడేవాడు. ఇందుకోసం 26 సిమ్‌కార్డులను ఉపయోగించాడు. ఈ దురలవాట్ల వల్ల దాదాపు రూ.2 కోట్ల వరకు అప్పులు చేశాడు. అయితే సెల్ఫీ వీడియోలో మాత్రం తాను నాశనం కావడానికి బాలిక కుటుంబమే కారణమని ఆరోపించాడు. దీంతో దారుణ హత్యలకు పాల్పడ్డాక చివరకు తన చావు సమయంలో సానుభూతి కోసం ప్రయత్నించాడనే అనుమానాలు కలుగుతున్నాయి.

### 'వాణ్ని కాల్చి చంపాల్సింది'

రాజ్‌కుమార్ చేసిన దారుణం వల్ల తమ కుటుంబం సమాజంలో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడిందని అతని సోదరుడు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. "వాడిని చిత్రహింసలు పెట్టి చంపాల్సింది. ప్రశాంతంగా చనిపోయి ఎన్నో కుటుంబాల మనఃశాంతిని హరించాడు. మా తమ్ముడు ఇంత దుర్మార్గుడవుతాడని ఎన్నడూ ఊహించలేదు" అని భాస్కర్ అన్నారు. మరోవైపు తన కూతురి జీవితాన్ని దుర్మార్గుడు నాశనం చేశాడని హత్యకు గురైన రాజ్‌కుమార్ భార్య సరిత తల్లి జయమ్మ విలపించారు. ప్రేమ పేరుతో వేధించి, మరో పెళ్లి సంబంధం చూసే పరిస్థితిని కూడా లేకుండా చేశాడని, చివరకు అత్యంత దారుణంగా చంపి తమ కుటుంబానికి తీరని అన్యాయం చేశాడని కన్నీటి పర్యంతమయ్యారు.

### బాధిత కుటుంబానికి 10 లక్షల సాయం

రాజ్‌కుమార్ చేతిలో హత్యకు గురైన మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యల ఆద్వర్యంలో దివ్యాంగురాలు మేఘనకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. దివ్యాంగురాలు మేఘన ఆలనాపాలన చూసుకోవాలని బంధువులకు సూచించారు. ఆమెకు ఎలాంటి ఇబ్బందిలేకుండా తాము అండగా ఉంటామన్నారు. ఇదిలా ఉండగా.. నిందితుడు రాజ్‌కుమార్‌ను ఆదివారం ఉదయం కొత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని అక్కవానిగూడెంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరిగిన నేపథ్యంలో.. సోమవారం ఉదయం నుంచి అక్కడ హైడ్రామా కొనసాగింది. బైపాస్ రోడ్డులో అడుగడుగునా పోలీసులు మోహరించడం తోపాటు వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు మాత్రం డంపింగ్ యార్డు విషయంపై సీఎం ఇంటిని ముట్టడిస్తారన్న ఉద్దేశంతోనే తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

### స్వగ్రామంలో అంత్యక్రియలకు కుటుంబ సభ్యుల నిరాకరణ

రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు సోమవారం సాయంత్రం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే రాజ్‌కుమార్ ఆత్మహత్యపై అనుమనాలు ఉండడంతో పోస్టుమార్టం చేసేందుకు ప్రభుత్వ వైద్యురాలు నిరాకరించారు. ఎవరైనా నిపుణులను పిలిపించాలని పోలీసులకు సూచించారు. దీంతో రాత్రి 8:30 గంటల తరువాత నిపుణులు వచ్చాకే పోస్టుమార్టం చేశారు. అనంతరం రాజ్‌కుమార్ అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలనే విషయం పోలీసులు తర్జన భర్జన పడ్డారు. మృతుని సొంత గ్రామంలో నిర్వహించాలని అతని భార్య తరపు బంధువులు కోరారు. అయితే మృతుని తల్లిదండ్రులు, సోదరుడు తమ గ్రామానికి మృతదేహన్ని తీసురేరావద్దన్నారు. వారికి కొందరు గ్రామస్తులు సైతం మద్దతు తెలిపారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో.. చేవెళ్లలోని స్మశాన వాటిలోనే దహనం చేశారు.

### 'ఆ కుటుంబాన్ని నమ్మి నాశనమయ్యాను'

మారణకాండకు పాల్పడేందుకు ముందు రాజ్‌కుమార్ సెల్ఫీవీడియో రికార్డు చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించిన సమయంలో అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 2:26 నిమిషాల నిడివి కలిగిన సెల్ఫీ వీడియో ఉన్నట్లు గుర్తించారు. హత్యలు జరిగిన రోజు సాయంత్రం 4.55 గంటలకు ఈ వీడియో రికార్డయింది. దాంతోపాటు నాలుగు పేజీల సూసైడ్ నోట్ కూడా పోలీసులకు లభ్యమైంది. సెల్ఫీ వీడియోలో, సూసైడ్ నోట్‌లో.. తాను మైనర్ బాలిక కుటుంబాన్ని నమ్మి మోసపోయానని, చేతులారా జీవితాన్ని నాశనం చేసుకున్నానని రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. తనను, నా కుటుంబాన్ని ఆ అమ్మాయి అన్నివిధాలా వాడుకుని వదిలేసిందని తెలిపాడు. ఆ అమ్మాయే తనను ప్రేమిస్తున్నానంటూ వెంట పడిందని, తాను ఒప్పుకోకపోతే చచ్చిపోతానని బెదిరించిందని, దాంతో తాను అంగీకరించానని వివరించాడు. ఓ రోజు ఆ అమ్మాయి తనను కలవడం ఆమె నానమ్మ, తల్లి చూసి.. డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టారని తెలిపాడు. వారు అడిగినప్పుడల్లా డబ్బులు ఇచ్చానని, వారి కోసం రెండు ఎకరాల వరకు భూములు అమ్ముకున్నానని వెల్లడించాడు. చివరికి తనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపే ప్రయత్నం చేశారని పేర్కొన్నాడు. రూ.50 లక్షలు ఇస్తావా? జైలుకు వెళతావా? అని బెదిరించారన్నాడు. వారి టార్చర్ భరించలేక గతంలో ఓసారి ఆత్మహత్యకు ప్రయత్నించానన్నాడు. తాను ఆదుకున్న కుటుంబమే తనను జైలుకు పంపే ప్రయత్నం చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది హత్యలకు పాల్పడుతున్నానని తెలిపారు. పరిస్థితి ఇంతదూరం రావడానికి బాలిక తల్లి, నానమ్మతోపాటు మరో నలుగురు బంధువులు కారణమని పేర్కొన్నాడు. తాము చనిపోతే వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో ఆ నలుగురిని కూడా రాజ్‌కుమార్ చంపాలని చూశాడేమోనన్న అనుమానాలు కలుగుతున్నాయి.

## దోపిడీ యంత్రాంగంగా విద్యా వ్యవస్థ

**విప్లవాత్మక మార్పులకు ఇదే సమయం: రాహుల్**



**న్యూఢిల్లీ, జూలై 13:** దేశ విద్యా వ్యవస్థ మోసపూరిత దోపిడీ యంత్రాంగంగా మారిపో యిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తేవాల్సిన సమయం ఆసన్నమైంద న్నారు. ఇప్పటికే ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారని.. విద్యా వ్యవస్థలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా ప్రధాని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మౌనం వహించి జవాబుదారీతనం నుంచి తప్పుకొన్నారని దుయ్యబట్టారు. 'అవినీతి, అన్యాయం, పక్షపాతం, నిజాయితీ లోపించడం.. ఈ నాలుగు పదాలు నేను చెబుతున్నవి కాదు.. దేశంలోని విద్యార్థులు మన విద్యా వ్యవస్థను ఉద్దేశించి వాడుతున్న పదాలు' అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ చేపట్టిన 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న డెహ్రాడూన్‌లో తలపెట్టిన ర్యాలీకి భారీగా తరలిరావాలన్నారు.

## కలిసి సాధిద్దాం!

(మొదటిపేజీ తరువాయి)

గోదావరి-కావేరి నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయమై ఛత్తీస్‌గఢ్ ను ఒప్పించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. "గోదావరిలో ఛత్తీస్‌గఢ్ కు 300 టీఎంసీల వాటా ఉంది. దానిని ఛత్తీస్‌గఢ్ వాడుకోవట్లేదు. భవిష్యత్తులో ఆ రాష్ట్రం 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీల మిగులు ఉంటుంది. అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉంది. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి" అని సీఎం రేవంత్ సూచించారు. ఇక్కడ నీళ్లు ఛత్తీస్‌గఢ్ వి అయితే నిధులు కేంద్రానివని, ఆ రెండింటిని తెలంగాణకు అనుకూలంగా సాధించాలని ఉద్బోధించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) ఇవ్వాల్సి ఉందని, వాటిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ సీఎంతో చర్చించామని, వారు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఎన్‌వోసీలు వస్తే అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 150-151 అడుగుల్లో నిర్మించేందుకు అనుమతి కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవిస్‌తో భేటీ అవుదామని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబైకి వెళ్లే బుల్లెట్ రైళ్లకు సంబంధించిన అలైన్‌మెంట్లు కొలిక్కి వచ్చాయని సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామని, వీటిలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్), ఎయిర్ కార్గోలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని, వీటిపై ఎంపీలు దృష్టి సారించాలని కోరారు.

### ఎంపీలడిగే సమాచారం ఇవ్వండి

కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ అంశాల విషయంలో ఏ సమాచారం కావాలన్నా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఎంపీలు అడిగిన సమాచారం వేగంగా వారికి అందజేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సూచించారు. పార్టీలకతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందించడానికి ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్‌కు ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని చెప్పారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఎంపీలు ఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటు చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదని, స్టోరేజీ సమస్య ఉందని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఆ సమాచారం తీసుకొని ఆయా అంశాలకు సంబంధించిన పెండింగ్ విషయాలు తెలియజేస్తే సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి డిజైన్లలోనే లోపాలున్నాయని, ఈ అంశంపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, కడియం కావ్య, రఘురామిరెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## మార్చి 31నాటికి.. (మొదటిపేజీ తరువాయి)

మేం వచ్చాక నిర్వాసితులకు క్రమం తప్పకుండా భూసేకరణ నష్టపరిహారం చెల్లిస్తున్నాం. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందు.. అనకాపల్లిలో గోదావరి జలాలకు అఖండ హారతి ఇస్తా(అంటే పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేస్తారు). అనకాపల్లి తర్వాతి ప్రాంతాలకు వచ్చే ఏడాది నీరిస్తాం. పారిశ్రామిక వినియోగానికి కూడా అందిస్తాం. విశాఖ వరకు గోదావరి జలాలను తరలించి.. ఉత్తరాంధ్రలోని వంశధార నదికి అనుసంధానం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాధాన్య ప్రాజెక్టులనూ మూడేళ్లలో పూర్తి చేస్తాం. గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించేందుకు ప్రభు త్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ధవళేశ్వరం బ్యారేజ్‌కు కొత్త గేట్లు బిగిస్తున్నాం. పుష్కరాల నాటికి 117 గేట్లూ మారుస్తాం. 2019లో జగన్ అధికారంలోకి వచ్చి పోలవరం ప్రాజెక్టుకు తీరని నష్టం చేశాడు. డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా గుర్తించలేదు. దీంతో నేను నిద్రలేని రాత్రులు గడిపాను. మళ్లీ నేనొచ్చాక రూ.990 కోట్లు వ్యయం చేసి కొత్త వాల్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 2నాటికి పూర్తి చేశాం. ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులు వేగంగా పూర్తవుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ రక్షణ పనుల కోసం రూ.200 కోట్లు వ్యయం చేస్తాం. ప్రాజె క్టు సమీపంలో ఐకానిక్ బ్రిడ్జ్, స్పిల్‌వే డిజైన్లపై మంగళవారం అమరావతిలో సమీక్ష నిర్వహిస్తాం. నిర్వాసితులకు న్యాయం చేస్తాం. అనుకున్న సమయానికి పోలవరం పూర్తయితే ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నీటి సమస్య శాశ్వతంగా తగ్గుతుంది. జగన్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను, వాటి నిర్వహణను పట్టించుకోలే దు. గేట్లు కొట్టుకుపోయినా కన్నెత్తి చూడలేదు. గ్రీజు పెట్టేందుకు కూడా నిధులివ్వలేదు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లు బిగించాం. గత రెండేళ్లలో సాగునీటి రంగంపై రూ.24 వేల కోట్లు ఖర్చుచేశాం. గోదావరి డెల్టా దేశానికి అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ధవళేశ్వరం ఆనకట్టే కారణం. 2.9 టీఎంసీల నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా.. ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ గోదావరి డెల్టాలకు కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ బ్యారేజ్ కు రూపకల్పన చేసిన మహనీయుడు కాటన్. 2014-19 మధ్య రూ.32 కోట్లతో ధవళేశ్వరం బ్యారేజ్‌లో 58 కొత్త గేట్లు అమర్చాం. మిగిలిన 117 పాత గేట్ల స్థానంలో కొత్తవాటిని 9 నెలల్లోనే అమర్చే విధంగా చర్యలు చేపట్టాం. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1200 కోట్లతో పుష్కర యాత్రికుల కోసం మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కోనసీమకు రైల్వేలైన్‌ను తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కొవ్వూరులో కోకోసిటీ ఏర్పాటు ద్వారా కోకో సాగును ప్రోత్సహించడంతోపా టు చాక్లెట్ల పరిశ్రమను ఇక్కడ నెలకొల్పుతాం. వాతావరణ మార్పులు, ఎల్‌నినో నేపథ్యంలో పంటల ఎంపికలో రైతులు శాస్త్రీయ విధానాలు పాటించాలి. గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై ఎట్టి పరిస్థితుల్లో నూ రాజీపడం. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. వీటిని తీవ్రంగా పరిగణిస్తున్నాం.గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషించడమే కాకుండా, గంజాయి సాగును గొడ్డలి పార్టీయే ప్రోత్సహించింది. పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారు. ఆడవాళ్లను అసభ్యకరంగా మాట్లాడేవారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోంది. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ ఆ పార్టీ నేతలు స్టూడియోలు పెట్టి ఫైనాన్స్ చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. వీరిపై కఠినచర్యలు తీసుకుంటాం. రాష్ట్ర పునర్నిర్మాణమేకూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రధాని మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలసి ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు విడుదల చేస్తాం. ప్రతి నెలా 1న సామాజిక భద్రతా పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. గోదావరి జిల్లాల ప్రజలు గతంలో టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఆశీర్వాదంగా భావిస్తున్నాం. సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని సమావేశ మందిరంలో సమీక్ష సందర్భంగా.. ఈ ఏడాది వర్షపాతం.. ప్రాజెక్టులకు జలాల చేరికపై వాసర్ సంస్థను సీఎం ఆరా తీశారు. సోమవారంనాటికి ఏయే డ్యాంలలో ఎం త ప్రవాహం ఉందో అంచనా వేశారా అని ప్రశ్నించా రు. ఇంకా అంచనా వేయలేదని వాసర్ వెల్లడించింది. సీఎం పర్యటన సందర్భంగా వచ్చిన జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ శశిభూషణ్ కుమార్ వేమగిరి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు వెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బంది ఆయన్ను అడ్డుకున్నారు. ఆయన మండిపడి.. వెంటనే బయటకు వచ్చి తన కారెక్కారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు వెంటనే వాహనం వద్దకు వచ్చి ఆయనతో మాట్లాడి సర్దిచెప్పి హెలిప్యాడ్ వద్దకు తీసుకెళ్లారు.

# రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- సాగునీరు,తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క






**ములుగు జులై 13**

దేవాదుల ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు గోదావరి జలాలతో సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక,ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క అన్నారు.సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ.లెనిన్ వస్సల్ టోప్పో,డి ఎఫ్ ఓ వికాస్ మినా, పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో మంత్రులు కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె.చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను,మోటార్ల పనితీరును,ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి,బట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు,భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం,సాగు త్రాగునీరు,మోటార్ల పనితీరు పై పి పి టి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు,తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో,దాని వల్ల వ్యవసాయం,తాగునీటి సరఫరా, జలవనరులపై కలిగే ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతుగా చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని,ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.దేవాదుల ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలనిములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారని,ఆర్థిక శాఖ మంత్రి సహకారంతో రూ.194 కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలు అని పేర్కొంటూ,ఆ సామర్థ్యానికి అనుగుణంగా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టు రూపకల్పనలో ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజుపాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి,సంపత్ రావు,ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ఇంజనీరింగ్ అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# "పేద దళిత కుటుంబాలకు బిజెపి ఎస్సీ మోర్చా అండగా ఉంటుంది"

**- ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్**



**నిజాంపేట్ జులై 13**

దళితులందరికీ బిజెపి ఎస్సీ మోర్చా అండగా ఉంటుందని అన్యాయం జరిగిన కుటుంబాల తరపున పోరాటం చేస్తుందని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ మరోసారి స్పష్టం చేశారు. సోమవారం వెంగళరావు నగర్ సర్వేనెంబర్ 45 లో ఇండ్లను కోల్పోయి నిర్వాసితులుగా ఉన్న ఎస్సీ కుటుంబాలకు సంఘీభావం తెలిపి వారికి మద్దతుగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య పర్యటనలో పాల్గొని వెంకటయ్య కి విజ్ఞప్తి చేస్తూ,ఏడు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఎస్సీ కుటుంబాలను రోడ్డు పాలు చేశారని, ప్రైవేటు భూమి మీద హైడ్రాకు ఏ హక్కు ఉందని ఇండ్లను కూల్చి వేశారని,ఉద్దేశపూర్వకంగానే ఎస్సీ కుటుంబాలు పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరు దారుణమని.. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ఎస్సి కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కుటుంబాలకు న్యాయం జరిగే వరకు.. భారతీయ జనతా పార్టీ ఎస్సీమోర్చా వారికి అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఏ దళిత కుటుంబానికి.. అన్యాయం జరిగిన భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ముందు వరుసలో ఉండే పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు, బాధితురాలు శ్రీమతి కాంచన కృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు, ఎస్సీ మోర్చా సెల్ కన్వీనర్స్ అరవింద్ తులసి,స్థానిక ఎస్సీ మోర్చా నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపున తాగితే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



మన వంటింట్లో ఉండే మసాలా దినుసుల్లో జీలకర్ర కూడా ఒకటి. భారతీయ వంటకాల్లో జీలకర్ర ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. దాదాపు మనం చేసే అన్ని వంటకాల్లో జీలకర్రను వాడుతూ ఉంటాం. వంటలకు చక్కటి రుచి తీసుకు రావడంలో జీలకర్ర పాత్ర ఎంతో ఉంది. జీలకర్రలో ఔషధ గుణాలతో పాటు మన శరీరానికి అవసరమయ్యే పొటాషియం, క్యాల్షియం, సెలీనియం, రాగి, మాంగనీస్ వంటి పోషకాలు కూడా ఎన్నో ఉన్నాయి. జీలకర్రను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అనేక రకాల అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. జీలకర్రను ఆహారంలో భాగంగా తీసుకోవడమే కాకుండా జీలకర్ర నీటిని తాగడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున ఈ నీటిని తాగడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**రక్తహీనతకు చెక్..**

జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. తద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరగడంతోపాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. జీలకర్ర నీటిని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తహీనతను తగ్గించడంలో కూడా జీలకర్ర నీరు మనకు సహాయపడుతుంది. జీలకర్రలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఐరన్ తక్కువగా ఉన్నవారు, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నవారు రోజూ జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది.

**కొలెస్ట్రాల్ తగ్గేందుకు..**

జీలకర్ర జీర ఎంజైమ్ లను ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీటిని తాగడంవల్ల జీరక్రియ మెరుగుపడుతుంది. అజీర్తి, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చక్కటి పొట్ట ఆరోగ్యానికి జీలకర్ర నీరు ఎంతో దోహదపడతాయి. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారికి జీలకర్ర నీరు ఎంతో మేలు చేస్తుంది. రక్తపోటుతో బాధపడే వారికి కూడా జీలకర్ర నీరు మేలు చేస్తాయి. జీలకర్ర నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

**లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..**

జీలకర్ర నీరు డిటాక్స్ డ్రింక్ గా కూడా పనిచేస్తాయి. ఈ నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఈ విధంగా జీలకర్ర నీరు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నీటిని ఉదయం పరగడుపున తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇక ఈ నీటిని మనం రెండు విధాలుగా తయారు చేసి తీసుకోవచ్చు. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే వడకట్టి తీసుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ నీటిలో ఒక టీస్పూన్ జీలకర్ర వేసి బాగా మరిగించి వడకట్టి తాగవచ్చు.

## విద్యార్థులకు అల్బెండొజాల్ మాత్రల పంపిణీ



**లక్షెట్టిపేట జులై13(మన సమాజం)**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పదివేల ఐదు వందల మంది ఒక సంవత్సరం నుండి పంతొమ్మిది సంవత్సరాల వయస్సు గల పిల్లలను గుర్తించి 90 శాతం మంది పిల్లలకు సోమవారం నాడు అల్బెండొజాల్ మాత్రలను అందజేశామని , మిగిలిన వారికి ఈనెల 20 తారీకు నాడు మాప్ అప్ డే రోజు మాత్రలను అందజేసి వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సమత తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య చేతుల మీదుగా విద్యార్థులకు టాబ్లెట్స్ అందించి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అల్బెండొజాల్ మాత్రలను ప్రభుత్వం అందజేస్తుందని తప్పకుండా విద్యార్థులు ప్రతీ ఒక్కరు వీటిని తీసుకోవాలని అన్నారు.ఈ మాత్రలను తీసుకోవడం వల్ల విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం మరింత మెరుగుపడి ఉన్నతంగా ఎదిగేందుకు తోడ్పడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ , ఎంపిడీఓ మధుసుధన్, ఇంచార్జీ ఎంఈఓ శైలజ, హెచ్ఈఓ దేవేందర్, హెల్త్ సూపర్ వైజర్ శోభ, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, వేణు , ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎం సుజాత, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం ఎన్నిక..



**మన సమాజం/చెన్నూరు:**

చెన్నూరు మండల ఉప సర్పంచుల మండలాధ్యక్షుడిగా సోమన్ పల్లి ఉప సర్పంచ్ తుమ్మల తిరుపతి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం రోజున ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు వారు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఉపాధ్యక్షులుగా బండం మహేష్, అల్లునూరి రాజశేఖర్ లు, ప్రధాన కార్యదర్శులుగా ముత్యాల సాయి, సంతోషం మహేష్ లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ఉప సర్పంచుల హక్కుల కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## నిర్మల్ జిల్లా స్థాయి u 23 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 న ఉదయం, 8:00 గంటలకు నిర్మల్ పట్టణంలోని గండి రామన్న సాయిబాబా ఆలయ సమీపంలోని శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి అ 23 వయసు గల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు జిల్లా కోచ్ రామరాజు తెలిపారు. 1 జనవరి 2003సంవత్సరం తరువాత జన్మించిన వారు ఆధార్కార్డు, తెల్లని జెర్సీ, కిట్ తీసుకొని కేంద్రానికి చేరుకోవాలని సూచించారు , వివరాలకు జిల్లా కోచ్ రామరాజు 9912939724కు సంప్రదించాలని కోరారు.

## శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి**

**ములుగు, జులై 13**




ములుగు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల లోని ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.సిద్ధార్థ రెడ్డి కోరారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.సిద్ధార్థ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మరియు బండారుపల్లి మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని,బోధనలో సాంకేతిక అంశాలను జోడిస్తూ విద్యార్థులకు ఆసక్తిని రేకెత్తించే విధంగా ఆహ్లాదకరమైన తరగతి వాతావరణం పెంపొందించే విధంగా,ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశంపై శిక్షణలో చర్చించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కోర్స్ కోఆర్డినేటర్ బూత్కూరి శ్యామ్ సుందర్ రెడ్డి,సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు సైకం శ్రీనివాస్ రెడ్డి, గుల్లపెల్లి సాంబయ్య,సంబంధిత సెంటర్ ఇన్చార్జ్ లు కన్నం వినోద్ కుమార్,గందె రమేష్,సింగారపు దేవకి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## బాలీవుడ్ బాట పట్టిన మీనాక్షి

హిట్ 2, లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మీనాక్షి చౌదరి బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా రాజ్ శాండిల్య దర్శకత్వంలో రూపొందుతోన్న 'భాగమ్ భాగ్ 2'లో ఈ ముద్దుగుమ్మ కథానాయికగా ఎంపికైంది. గతంలో వచ్చిన సూపర్‌హిట్ కామెడీ మూవీ 'భాగమ్ భాగ్'కు ఈ సినిమా సీక్వెల్ కావటం విశేషం. తొలి భాగం తరహాలోనే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నదని, మీనాక్షి కెరీర్‌లో ఓ మైలురాయిగా ఈ సినిమా నిలువనున్నదని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ నెలలోనే షూటింగ్ ప్రారంభించి, ఈ ఏడాది చివరిలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్, అయేషాఖాన్ ఇందులో కీలక పాత్రధారులు.

## 'కల్కి 2'కు సర్వం సిద్ధం?



'కల్కి 2898ఏడీ' చిత్రం పానిండియా స్థాయిలో సృష్టించిన సంచలనం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు పన్నెండొందల కోట్లు వసూలు చేసి ప్రభాస్ స్టామినా ఏంటో మరోసారి రుజువు చేసిందీ సినిమా. ఇప్పటివరకూ వచ్చిన ఫ్రాంచైజీల్లో తొలి పార్ట్‌కు ఇంత వసూళ్లు రావడం 'కల్కి 2898ఏడీ' విషయంలోనే జరిగింది. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ పార్ట్ కోసం ఆడియన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సెకండ్ పార్ట్‌కు సంబంధించిన కొంత పుటేజ్ ఇప్పటికే సిద్ధంగా ఉందని, మిగతా షూటింగ్‌కు ఎక్కువ సమయం పట్టదని గతంలో మేకర్స్ ప్రకటించారు. మరి ప్రభాసేమో ఫౌజీ, స్పిరిట్ షూటింగుల్లో బిజీగా ఉన్నారు. అందుకేనేమో.. అమితాబ్‌తో షూటింగ్ మొదలుపెట్టబోతున్నారు 'కల్కి 2' యూనిట్. ఇది నిజంగా డార్లింగ్ అభిమానులకు శుభవార్తే. ప్రస్తుతం 'కల్కి 2' పనిమీద బిగ్‌బీ హైదరాబాద్‌లోనే ఉన్నారు. త్వరలోనే ఆయన మళ్లీ అశ్వత్థామగా మారబోతున్నారు. ఇంకొన్ని రోజుల్లోనే షూటింగ్ మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ లేని సీక్వెన్స్‌ని షూట్ చేస్తారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.

## అందరు యాక్టర్లతో కలిసి కనిపిస్తా..



చాలా మంది స్టార్లున్న సినిమాలో భాగం కావడం, వారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పింది. అంతేకాదు కూలీ ఆసక్తికర కథనంపై ప్రశంసలు కురిపించింది. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథలో కీలకంగా సాగేలా ఉండబోతుందన్నది. ఇక లోకేశ్ కనగరాజ్ ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, తలైవా స్క్రీన్ ప్రెజెంటేషన్ కూలీని బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిలుపబోతున్నాయని ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్‌కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## ఇండో అమెరికన్ మూవీలో..



వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా దూసుకుపోతున్నది బెంగళూరు భామ ప్రియమణి. 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్ బాలీవుడ్‌లోనూ ప్రియమణికి మంచిపేరు తెచ్చిపెట్టింది. ఆమె కీలక పాత్ర పోషించిన విజయ్ 'జననాయగన్' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఇదిలావుంటే.. అత్యంత భారీ స్థాయిలో నిర్మించనున్న ఓ ఇండో అమెరికన్ ప్రాజెక్ట్ కోసం ఓ ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఇటీవలే ప్రియమణిని సంప్రదించారు. అందులోని కీలక పాత్రకోసం ప్రియమణిని ఎంపిక చేసుకున్నారు. హర్ష్ మహాదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం.. ఇండో అమెరికన్ సంస్కృతుల నేపథ్యంలో ఒక వలస కుటుంబం కొనసాగించే సున్నితమైన భావోద్వేగ ప్రయాణమని తెలుస్తున్నది. ప్రముఖ బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సివుంది.